క్లుప్తంగా

శ్రీరంగనాథుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న శ్రీరంగనాథుడు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కార్తీక మాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం బిందెసేవ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదం అందజేశారు.

అయ్యప్ప స్వామికి పడిపూజ

ఎం.అగ్రహారం గ్రామంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి వారికి శనివారం ప్రత్యేక పడి పూజ నిర్వహించారు. ముందుగా స్వామి వారికి 18 మెట్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు, దీక్ష ధారులు, గురుస్వామి నాగరాజు ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు. అయ్యప్ప మాలధారులకు, భక్తులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



సూదాపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తును కొలుస్తున్న వైద్యులు

వెల్దుర్తి(కృష్ణగిరి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం కింద మండల పరిధిలోని సూదాపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి, సిబ్బంది ఆదిలక్ష్మి, వీణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి



అనసూయ (ఫైల్)

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో ఈ నెల 14వ తేదీన పిడుగుపాటుకు గురై ఆదోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురువ అనసూయ (32) కోలుకోలేక మృతి చెందింది. 14న మధ్యాహ్నం పొలంలో పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం మొదలు కావడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు కొంత దూరంలో పిడుగుపడింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన అనసూయను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోనిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిందని గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకోండి



తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ ప్రజలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని రామళ్లకోట రోడ్డులో బ్రిడ్జికి అనుకుని వంక పోరంబోకు స్థలాన్ని కొందరు కబ్జా చేశారని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు గ్రామస్తులు శ్రీనివాసులు, నాగరాజు తదితరులు శనివారం ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని కబ్జా చేసి షాపులు కట్టుకున్నారని, విచారించి అక్రమలను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆక్రమణలను తొలగించి వంక సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ ఉద్యమకారులను మరువరాదు



సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయ ఉద్యమం వెన్నెముకగా నిలిచిందని, ఆంధ్రలో మొదలైన గ్రంథాలయ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించిందని, ఈ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన ఉద్యమకాలను మరువరాదని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు స్థానిక గ్రంథాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కవిత బాయి, ఖాదర్‌బాషా, సాలమ్మ పాల్గొన్నారు.

అనుసంధానం తప్పనిసరి

- బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈనెల 30లోపు అనుసంధానం చేసి బ్యాంక్ ఖాతాలను పునరుద్ధరించాలని ఆదేశం
- నియోజకవర్గంలో ఎన్‌పీసీఐ లింక్ కాని ఖాతాలు 26,211
- ప్రారంభమైన ప్రక్రియ



పీ.కొత్తూరులో బయోమెట్రిక్ వేయిస్తున్న బీపీఎం రామాంజనేయులు

తుగ్గలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) లింక్ తప్పనిసరి చేసింది. ఇటీవల వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకు ఉన్న ఖాతాలు లేకపోవటంతో ప్రభుత్వం నుంచి వారికి అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో జాబితాలను ఆయా ప్రాంతాలకు పంపించింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం మనుగడలో లేని ఖాతాలను తెరిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 30వ తేదీలోగా పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

ఖాతాల డిజిటలైజేషన్..

పత్తికొండ నియోజకవర్గంలో వివిధ గ్రామ పంచాయతీల్లో నివాసముంటున్న వారికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ.. వాటిలో 26,211 ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజేషన్ చేయాలని ఈనెల 6వ తేదీన కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండిన వారంతా పోస్టాఫీసుల్లో కొత్త ఖాతా తెరవాలని చెబుతున్నారు. దీనిపై ఆయా సచివాలయాల పరిధిలో సిబ్బంది సిద్ధం చేశారు. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆయా ఖాతాలకు ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం వారి ఖాతాకు సంబంధిత బ్యాంకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో పత్తికొండ, వెల్దుర్తి, తుగ్గలి మండలాల్లో అధిక శాతం మంది ఖాతాదారులు అనుసంధానం చేసుకోలేదు.

నియోజకవర్గంలో ఎన్‌పీసీఐ లింక్ లేని ఖాతాలు 26,211

మండలం.	లింక్ కాని ఖాతాలు
పత్తికొండ.	7,014
వెల్దుర్తి.	6,120
తుగ్గలి.	5,037
మద్దికెర.	4,177
కృష్ణగిరి.	3,863

ఖాతాలను లింక్ చేసుకోవాలి



ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖతా మనుగడలో ఉండాలి. కొందరికి రెండు, మూడు ఖాతాలు ఉంటే వాటిలో కొన్ని వినియోగంలో లేకపోవటంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో మనుగడలో లేని ఖాతాల వివరాలు పునరుద్దరించుకునేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్లు గుర్తించింది. వారందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందించి లింక్ చేసు కోవాలని సూచిస్తున్నాం.

– విశ్వమోహన్, ఎంపీడీఓ, తుగ్గలి

జయప్రదం చేయండి

పత్తికొండ(తుగ్గలి) : ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బండిగేరి, రాజీవ్‌నగర్, యశోద కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల18వ తేదీన సచివాలయాల ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సురేంద్రకుమార్, రామాంజినేయులు, నాగరాజు, ఉరుకుందు, రంగస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ, గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 18వ తేదీన గ్రామ సచివాలయ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని నరసాపురం గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని వారికి స్థలాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా చేపట్టే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సాంబశివుడు, దస్తగిరి, అంజినేయులు, రాముడు పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ఆలూరులో సామాజిక బహిరంగ సభలో విచారణ చేస్తున్న డ్వామా ఏపీడీ మాధవీలత

ఆలూరు రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవీలత అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పథకం సామాజిక బహిరంగ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 14 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో పథకం కింద 1,188 పనులకు గాను రూ.12.44 కోట్లు కేటాయించారన్నారు. ఇందులో భాగంగా చేసిన పనులపై బహిరంగ విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి సిబ్బంది నిర్దేశించిన పని లక్ష్యాలను పకడ్బందీగా చేయాలన్నారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు పనులను కల్పించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ పీడీ పద్మావతి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేష్, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ,టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఇదిలా ఉండగా..రూ.29,777 అవినీతి జరిగిందని రికవరీకి ఆదేశించారు. అలాగే.. ఆ శాఖ అధికారులు చేసిన పొరపాట్లకు రూ.95వేలు జరిమానా విధించామని మాధవీలత వెల్లడించారు.

భక్తి శ్రద్ధలతో గౌరీ నోములు



ఆలూరులో గౌరీ మాతకు హారతులిస్తున్న మహిళలు



గూళ్యంలో హారతులు, కలశాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు, చిన్నారులు



హొళగుందలో పూజల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



హొళగుందలో గౌరమ్మ విగ్రహానికి హారతి ఇస్తున్న మహిళలు



నిట్రవట్టిలో గౌరీదేవి ఆలయం వద్ద పూజలకు తరలివచ్చిన మహిళలు

ఆలూరు రూరల్ : మండలంలోని గ్రామాల్లో, పట్టణంలోని కోట వీధిలో వెలసిన గౌరీ దేవి ఆలయంలో కార్తీక మహోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గౌరీ ఆలయంలో భక్తుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం మహిళలు గౌరీ నోములు నోచి, చక్కెర హారతులు, దీపాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

హాలహర్వి: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం గౌరీదేవి(గౌరమ్మ)కు కార్తీకమాస పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. గ్రామాల్లో గౌరీదేవికి మహిళలు కలశాలు, చక్కెర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

హొళగుంద: మండలంలో శనివారం పెద్ద గౌరమ్మ పండుగ ఘనంగా జరిగింది. చిన్నారులు, యువతులు రాత్రి గౌరమ్మలు కొలువుదీరిన ఆలయాలకు వెళ్లి పూజలు చేసి హారతులు సమర్పించారు. గౌరమ్మ విగ్రహాలకు చక్కెర హారతులతో నైవేద్యం సమర్పించారు. కర్ణాటక సంప్రదాయాలను పాటించే ఇక్కడి ప్రజలు ఈ పండుగకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆడపడుచులను ఇళ్లకు ఆహ్వానించి వారితో కలిసి రెండు రోజుల పాటు వేడుకలు జరుపుకుంటారు. ఇందులో భాగంగా ఆదివారం మిద్దెలపై కొంతెమ్మ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకుంటారు.

మహిళ ఆత్మహత్య



మాధవలక్ష్మి (ఫైల్)

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన ఉప్పర మాధవలక్ష్మి (45) కడుపునొప్పి తాళలేక శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మూడు నెలల నుంచి కడుపునొప్పితో మాధవలక్ష్మి బాధపడుతూ ఉండేది. పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపైవిరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం తెల్లవారుజామున పురుగు మందు సేవించింది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద క్షేత్రంలో అమలు చేస్తున్న శాశ్వత నిత్య అన్నదానం కోసం శనివారం ఆదోనికి చెందిన గుళ్లెం శివమ్మ కుటుంబ సభ్యులు రూ.50వేలను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండును, ఫొటోను అందజేశారు.

ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు

- నియోజకవర్గంలో 175 పనులు మంజూరు
- రూ.9.81కోట్లు విడుదల
- డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామంటున్న అధికారులు

మండలాల వారీగా పనులు, మంజూరైన నిధులు, పూర్తయిన పనులు

మండలం	పనులు	నిధులు	పూర్తయినవి
పత్తికొండ	37	రూ.2.కోట్లు	14
తుగ్గలి	29	రూ.1.81 కోట్లు	3
మద్దికెర	38	రూ.2కోట్లు	16
వెల్దుర్తి	30	రూ.2కోట్లు	10
కృష్ణగిరి	41	రూ.2కోట్లు	10



ముక్కెల్లలో వేస్తున్న సీసీరోడ్డు

పత్తికొండ(తుగ్గలి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. నియోజవర్గంలోని ఐదు మండలాల్లో రూ.9.81 కోట్లతో మొత్తం 175 పనులు చేపడుతున్నారు. వాటిలో ఇప్పటి వరకు 53 ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి కాగా పలు చోట్ల పనులు జరుగుతున్నట్లు పంచాయతీరాజ్ అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయని చెబుతున్నారు. డిసెంబర్ నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

డిసెంబర్ నెలాఖరులో నిర్మాణాలు పూర్తి



నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ.9.81 కోట్లతో మొత్తం 175 పనులు చేపడుతున్నాం. సీసీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెల ఆఖరులో సీసీ రోడ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చూస్తాం.

– శేషయ్య, పీఆర్ డీఈ, పత్తికొండ

డిజిటల్ ప్రోగ్రెస్ కార్డుల అందజేత

హొళగుంద: తాను చదివిన పాఠశాల అభివృద్ధికి సహాయాన్ని అందిస్తున్న మిక్కిలినేని వెంకట శివప్రసాద్ శనివారం డిజిటల్ మల్టీకలర్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. పాఠశాలలో 6 – 10వ తరగతి వరకు చదువుతున్న 2 వేల మంది విద్యార్థులకు అందజేసేందుకు రూ. 25 వేల విలువ జేసే డిజిటల్ ప్రోగ్రెస్ కార్డులను ప్రింటింగ్ చేయించి హెచ్ఎం నజీర్ అహమ్మద్‌కు అందజేశారు. 1989–90 బ్యాచ్‌కు చెందిన మిక్కిలినేని వెంకట శివప్రసాద్ ఇప్పటికే.. పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.లక్ష నగదు బహుమతిగా అందజేశారు. విద్యార్థుల కోసం రూ.2.50 లక్షలతో మంచినీటి ట్యాంకును కట్టించాడు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు రూరల్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు నారాయణ స్వామి, మండల కన్వీనర్ షాకీర్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు శనివారం కమ్మరచేడు పీహెచ్‌సీ డాక్టర్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఎస్‌సీడీ సర్వేలు రద్దు చేసి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విజయవంతం చేయండి

దేవనకొండ: ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం తమదేన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటుకు పూనుకుందామన్నారు. రంగన్న, మండలాధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్, రవితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

28న తలనీలాలు, టెంకాయల విక్రయానికి వేలాలు

మద్దికెర : మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాయలంలో సంవత్సరం పాటు టెంకాయలు, తమలపాకులు విక్రయించుటకు, అలాగే టెంకాయ చిప్పలు ప్రోగు చేసుకునే హక్కు, స్వామి వారి ఫొటోలు అమ్మేందుకు, మిశ్రమ బియ్యం, బేడలు విక్రయంచే హక్కుకు ఈనెల 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు దేవాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఈఓ వీరయ్య శనివారం తెలిపారు. వేలంపాటల్లో పాల్గొను వారు టెంకాయలు, తమలపాకులు అమ్ముకొను హక్కుకు రూ.50 వేలు, తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు రూ.లక్ష, టెంకాయల చిప్పలు ప్రోగు చేసుకునేందుకు, స్వామి వారి ఫొటోలు విక్రయించుటకు రూ.10 వేలు, మిశ్రమ బియ్యం బేడలు విక్రయించుటకు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి

వెల్దుర్తి(కృష్ణగిరి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీస కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మహిళల న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. అత్యాచారాలు, అదనపు కట్నం వేధింపులు, సమానపనికి సమాన వేతనం, మహిళల అక్రమ రవాణా, లోక్ అదాలత్ పనితీరు తదితర వాటిపై మహిళలకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, కుమారి, సీడీపీఓ లూక్, ఎస్ఐ జి. ఆశోక్ పాల్గొన్నారు.

జాతీయ పత్రికా దినోత్సవం

పత్తికొండ(తుగ్గలి) :ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని శనివారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు సాలరంగడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌నాథ్ గుప్తా, వెంకటేష్, రంగన్న, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దేవనకొండ: మంలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెర్నెకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.రాముడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడతామని చెప్పారు.

బండరాళ్లను తొలగించండి



హొళగుంద: స్థానిక కోటవీధిక్లో రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం కోసం అడ్డంగా ఉన్న రాళ్లబండలు, కంకర రాళ్లు, పూడిక తదితర వాటిని తొలగించి రోడ్డు పైనే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన దారి కావడంతో నిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్లు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. సింగిల్ రోడ్డు కావడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, వెంటనే తొలగించాలని వీరభద్రగౌడ్ కోరారు.

హొళగుంద కోటవీధిలో రోడ్డు పైనే వదిలేసిన బండలు

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

హొళగుంద: కార్తీక మాస సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లింగంపల్లి, నెరణికి, పెద్దహ్యాట తదితర గ్రామాలతో పాటు హొళగుంద సమీపంలో వెలసిన అగ్రహార ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పుట్లూరులో ఇళ్ల మధ్య ఉన్న మురుగు కుంట

● ఇలా ఉంటే రోగాలు రావా?

కృష్ణగిరి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.. గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుకు కృషి.. ఇలా రోజూ అధికారులు వివిధ కార్యక్రమాల్లో ముందుగా చేసే ప్రకటనలు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. అధిక శాతం గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి జనం వ్యాధుల బారిన పడుతున్నారనేది నిష్ఠుర సత్యం. ఇళ్ల మధ్యనే మురుగు కుంటలు ఉన్నా శుభ్రం చేయక పోవడంతో దోమలకు ఆవాసంగా మారి వ్యాధులకు కారణభూతమవుతున్నాయి. ఇక పందులు వాటిలో సంచరిస్తూ ఇళ్ల మధ్య వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల మధ్యనున్న కుంటలను పూడ్చి శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామస్తులు కోరుచున్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

తుగ్గలి : మండలంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ శ్రీ గుండు రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో తొలి రోజు గంగపూజ, గోపూజ, కలశస్థాపన తదితర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com